క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

7 నుంచి అథ్లెటిక్ పోటీలు

జమ్మలమడుగు : మండల స్థాయి అథ్లెటిక్ పోటీలను ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభిస్తామని పీఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాయురాలు శశికళ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పీఈటీలతో పీఆర్ ఉన్నత పాఠశాలల్లో అథ్లెటిక్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం 7న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 8వ తేదీ అథ్లెటిక్స్, 9వ తేదిన యోగా, బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 6వ తేది సాయంత్రం లోపు ఎంట్రీ ఫారాలను పీఆర్ ఉన్నతపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీ, మండల కోఆర్డినేటర్‌కు ఇవ్వవాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు మురళీ, ఎర్రన్న, ప్రసాద్‌రెడ్డి, ఆమూదాబి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల పరిధిలోని ఆర్టీపీపీలో ఈ నెల 15 నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ నాయకులు కోరారు. శనివారం సమ్మెకు సబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించేందుకు జెన్‌కో యజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమ్మెతో రాష్ట్రంలోని రైతులకు సాగు, తాగునీరు సరఫరాకు విద్యుత్ ఉత్పత్తి పంపిణీలో అంతరాయం ఏర్పడుతుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపాల్ శివశంకర్

సింహాద్రిపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వివిధ జాతులకు చెందిన సుమారు 120 మొక్కలను నాటి నీరు పోశారు. పచ్చని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించడంలో విద్యార్థులు, సిబ్బంది భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి జెండా పండుగ



జెండా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో దస్తగిరి స్వామి జెండా పండుగను భక్తులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దర్గాల వద్ద భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దర్గాలను విద్యుత్ దీపాల కాంతులతో ముస్తాబు చేశారు. కుల మాతాలకు అతీతంగా అందరూ తరలి వచ్చి మొక్కుబడులు చెల్లించుకోని ప్రార్థనలు చేశారు. ఐదు రోజులుగా దర్గాల వద్ద దస్తగిరి స్వామి పుస్తక పఠనం చేస్తున్నారు.

కలుషిత జలం.. కావాలి అప్రమత్తం

- అటకెక్కిన నీటి పరీక్షలు
- క్లోరినేషన్ చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



అచ్చివెళ్లి రహదారిలో లీకేజీ అవుతున్న పైపులు



కొత్తపల్లెలో అపరిశుభ్రంగా మోటర్



వాటర్ ట్యాంకు వద్ద పేరుకుపోయిన పాచి

పులివెందుల రూరల్ : వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. తాగునీరు కలుషితం కావడమే వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం. డ్రైనేజీలు, చెరువుల్లో మురుగునీరు చేరడం, పైపులైన్లు మరమ్మతులకు గురికావడం, కుళాయిల చుట్టూ అపరిశుభ్రంగా ఉండడం వల్ల తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలుతుంటాయి. వీటికి అడ్డుకట్ట వేయాలంటే పైపులైన్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించడంతో పాటు నీటి నాణ్యత పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. కానీ అధికారులు నిర్లక్ష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో మంచినీటి పథకాలు, పైపులైన్ల గేట్ వాల్వ్‌ల వద్ద నీటి లీకేజీల కారణంగా మురుగునీటి నిల్వలో నీరు కలుషితమవుతోంది. అధికారులు పర్యవేక్షణ లోపంతో కనీసం నీటి ట్యాంకులను రెండు నెలలకొకసారి కూడా శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ప్రజలకు రక్షిత మంచి నీరు ప్రశ్నార్థకంగా మారింది. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరు మండలాలలో వాటర్ ట్యాంకులు శుభ్రం చేసేవారు లేక వాటర్ ట్యాంకులు పాచి పట్టిన దుర్గధం వెదజల్లుతున్నాయి.

అధికారలు అలసత్వం

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయాలని, పరిశుభ్రం చేసిన తేదీలను, పరిశుభ్రం చేయాల్సిన తదుపరి తేదీలను బోర్డుపై ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది వాటర్ ట్యాంకులను నెలలు తరబడి శుభ్రం చేయడంలేదు. ప్రజలకు క్లోరినేషన్ చేసిన రక్షిత మంచినీటిని సరఫరా చేయడం లేదు. నియోజకవర్గంలో అధిక గ్రామాల్లో క్లోరినేషన్ చేపట్టడం లేదు. ప్రతి రక్షిత మంచినీటి పథకం వద్ద రిజిస్టర్లు ఏర్పాటు చేసి ఎంత పరిమాణంలో తాగునీటి సరఫరా చేసింది, బ్లీచింగ్ పౌడర్ ఎంత కలిపేది నమోదు చేయాలి. కానీ అసలు రిజిస్టర్లే కనిపించడం లేదు. ట్యాంకులపైన మూత వేసి ఉంచాలి. ట్యాంకులు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలి. నీటి కుళాయిల చుట్టూ సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేయాలి. అయితే పైపులైన్ల లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారు. చాలా గ్రామాల్లో తాగునీటి పైపులు లీకేజీ కావడంవల్ల తాగునీటిలో మురుగు నీరు కలుషితమవుతుండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు.

అధికారులు స్పందించాలి

ట్యాంకులను నిర్దేశిత సమయంలో శుభ్రం చేయకపోవడంతో అడుగున పాచి పేరుకు పోతుంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ట్యాంకులను శుభ్రతలో పంచాయితీ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పకైనా అధికారులు స్పందించి పైపులైన్ల లీకేజీలను అరికట్టి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించి గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైఎస్ జగన్ హయాంలోనే సుపరిపాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్య సాయినాథ్



కమలాపురం : రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలోనే సుపరిపాలన అందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. డిజిటల్ బుక్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డికి, పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఇక 25 వార్డులు



జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఆదేశాల మేరకు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజన కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు పూర్తిచేశారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మున్సిపాలిటీ పరిధిలో 20 నుంచి 25కు వార్డుల సంఖ్య పెంచారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న జమ్మలమడుగు 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగర పంచాయతీగా మార్చారు. మొదటిసారిగా 20 వార్డులను విభజించారు. ప్రతి వార్డుకు 1,700 నుంచి 2,000 వరకు ఓటర్ల సంఖ్యను నిర్ణయించారు. అప్పటి నుంచి 2025 వరకు కొనసాగించారు. ప్రస్తుతం నగర పంచాయతీని అప్‌గ్రేడ్ కావడంతో మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య 20 నుంచి 25కు పెంచుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గెజిట్ విడుదల చేశారు.

అభ్యంతరాలు తెలపాలి

మున్సిపల్ వార్డులు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు తమ అభ్యంతరాలతో పాటు సూచనలు, సలహాలు సోమవారం సాయంత్రంలోపు మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి కోరారు. ప్రజల సూచనలు పరిగణలోనికి తీసుకుంటారని తెలిపారు.

సోమవారం కౌన్సిల్ సమావేశం!

మున్సిపల్ వార్డుల పెంపుపై సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించబోతున్నట్లు సమాచారం. అధికారులు ఈ కౌన్సిల్ సమావేశంలో గెజిట్ ప్రవేశపెట్టి కౌన్సిల్ సభ్యులను పెంచుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు జమ్మలమడుగు మున్సిపల్ కౌన్సిల్‌కు పోటీ పడనున్నారు.

నామమాత్రంగా మండల మీట్

ముద్దనూరు : మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎలాంటి సమస్యలను ప్రస్తావించకపోవడంతో చప్పగా ముగిసింది.

శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఒకరిద్దరు సభ్యులు మాత్రమే చర్చలో పాల్గొన్నారు. ప్రతిరోజూ దేనేపల్లె-ముద్దనూరు రహదారిలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు స్థానికులకు అసౌకర్యంగా ఉందని, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. బస్సులు నల్లబల్లె బస్‌స్టాప్ వద్ద ఆపడంలేదని, దీంతో నల్లబల్లె వాసులు ముద్దనూరుకు వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తోందని ఎంపీటీసీ సభ్యురాలు ఫిర్యాదు చేశారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ రాధాకృష్ణాదేవి, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహనలో భాగంగా శనివారం రాత్రి మెలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల వల్ల జరిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై కళాజాత బృందం ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగమురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారు మబ్బులు

నీలి ఆకాశంలో నల్లని మేఘాలంటే మనందరికీ సుపరిచితమే. వెండి లాంటి మేఘాలు వినీలాకాశంలో ఆహ్లాదంగా దర్శనమివ్వడం తెలిసిన విషయమే. కానీ బంగారు వర్ణంలో మబ్బులు ఉంటే ఎంత చూడముచ్చటగా ఉంటుందో కదా. అలాంటి దృశ్యమే ఆవిష్కృతమైంది. అది ఎక్కడో కాదు మన ముద్దనూరు ఘాట్‌లో శనివారం సూర్యోదయం, సూర్యాస్తమయ సమయంలో తెల్లని మబ్బులు బంగారు వర్ణంలో మెరిసిపోయాయి. ఇవి కాస్త అగ్ని పర్వతం బద్దలై లావాను కక్కుతున్నట్లు కనిపించాయి. ఈ సుందర దృశ్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయం సంధ్య వేళ ఆకాశంలో వచ్చిన మార్పునకు ప్రకృతి ప్రేమికులు ఫిదా అయ్యారు. సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి ఆస్వాదించారు.

– జమ్మలమడుగు





ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి

కమలాపురం : ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా శనివారం కమలాపురం మార్కెట్ యార్డు వద్ద నుంచి స్థానిక టీడీపీ కార్యాలయం వరకు జరిగిన ఆటో డ్రైవర్లతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఉపాధి కోసం కూటమి ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సహాయం అందించిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 1,908 మందికి ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా మంజూరైన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆర్డీవో జాన్ ఎర్విన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలకు చేయూత

జమ్మలమడుగు: కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు చేయూత నందిస్తున్నామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో ఆటో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో ఆర్డీఓ సాయి శ్రీ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న వెంకట మహేశ్వరరెడ్డి

సింహాద్రిపురం : దేశ సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిస్తూ ప్రతిరంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రిటైర్డు ఆర్మీ వెంకట మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని జున్ను నారాయణరెడ్డి మిల్లులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం – దేశం కోసం పనిచేసే హిందువులను కలపడం కోసం ప్రతి గ్రామం – ప్రతి బస్తీలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి కత్తి రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆరుబయటే మందులు



ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో వరండాలో నిల్వ చేసిన మందుల బాక్స్‌లు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో రోగులకు అందించే మందులన్నీ వరండాలో నిల్వ ఉంచారు. జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన మందులను భద్రపరచడానికి గది లేక పోవడంతో వరండాలోనే నిల్వ చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం పరిధిలోని ఒక్క యర్రగుంట్ల పట్టణం తప్ప పొట్లదుర్తి, పివెంకటాపురం, హనుమనుగుత్తి, తిప్పలూరు, పెద్దనపాడు, వైకోడూరు కదిరివారిపల్లి, వలసపల్లి, తుమ్మలపల్లి, బిస్మిల్లాబాదు, కేజీవీ పల్లి, టీ సుంకేసుల గ్రామాలు పీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. ఆయా గ్రామాల్లో ఎఎన్ఎంలు వైద్య సేవలు ప్రజలకు అందిస్తుంటారు. పీహెచ్‌సీకి జిల్లా ఆసుపత్రి నుంచి మందులను సరఫరా చేస్తారు. అయితే మందులను భద్రపరచడానికి సరైన గది లేకపోవడంతో ఆసుపత్రి వరండాలోనే నిల్వ చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి మందులను భద్రపరచుకోవడానికి ప్రత్యేక గదిని మంజూరు చేస్తే బాగుంటుందని రోగులు కోరుతున్నారు.

'నా భూమిని కబ్జా చేశారు'



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కమాల్ సాహెబ్

ప్రొద్దుటూరు రూరల్ : పిత్రార్జితంగా వచ్చిన తన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారని చాపాడు మండలం ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన తాళ్లమాపురం కమాల్ సాహెబ్ దంపతులు శనివారం ప్రొద్దుటూరు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమాల్ సాహెబ్ మాట్లాడుతూ తమ భూములు తాళ్లమాపురం గ్రామ పంచాయతీ పొలంలోని సర్వే నంబర్ 739లో 1.25 ఎకరాలు, 462/ఏ1లో 0.55 ఎకరాలు ఉందన్నారు. తన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేసి పంటలు పండిస్తున్నాడన్నారు. అధికారులు కూడా ఇందుకు సహకరించడంతో తాను ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను భూమి వద్దకు వెళ్లిన ప్రతి మారు తనను నానా దుర్భాషలాడి కొట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో అనేక మార్లు వీఆర్‌ఓకు ఫిర్యాదు చేశానని, రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తనకు ఒక కన్ను మాత్రమే ఉందని, వృద్ధ దంపతులమైన తమకు మరో జీవనాధారం లేదని, ఉన్నతాధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కబ్జా దారుల నుంచి తమ భూమిని విడిపించి న్యాయం చేయాలని కోరారు.

నిండుకుండలా జలాశయాలు



మైలవరం జలాశయం



గండికోట ప్రాజెక్టు

జమ్మలమడుగు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో నేడు రాయలసీమ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందుతోంది. శ్రీశైలం నుంచి కృష్ణ జలాలు తీసుకురావడం కోసం గాలేరు-నగరి సుజల స్రవంతిలో అంతర్భాగంగా నిర్మించిన గండికోట ప్రాజెక్టు పూర్తి చేశారు. ఆయన మరణాంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు 90 శాతం పూర్తయిన మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ప్రాజెక్టులో 26 టీఎంసీల నీరు నిల్వ చేసే విధంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో సరైన వర్షాలు లేకున్న కృష్ణజలాలు గాలేరు-నగరి వరద కాలువల ద్వారా భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో గండికోట ప్రాజెక్టులో దాదాపు 25టీఎంసీలు, మైలవరం ప్రాజెక్టులో 5 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులకు తాగు, సాగు నీటి కొరత తీరింది.

కేసు నమోదు

కాశినాయన : మండలంలోని చిన్నాయపల్లె గ్రామానికి చెందిన గుర్రాల రాజకుమార్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ యోగేంద్ర తెలిపిన మేరకు వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన గుర్రాల రమణారెడ్డి వద్ద రాజకుమార్‌రెడ్డి డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఇద్దరి మధ్య డబ్బుల విషయమై గొడవ జరిగింది. రమణారెడ్డిపై రాజకుమార్‌రెడ్డి దాడి చేసి గాయపరిచాడు. రమణారెడ్డి ఫిర్యాదు మేరకు రాజకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

7న క్రీడా పోటీలు

రాజుపాళెం : రాజుపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 పోటీలను నిర్వహించనున్నట్లు హెచ్ఎం వసుంధర దేవి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ 7న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, 8న అథ్లెటిక్స్, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు.